TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 108 | బుధవారం 11-12-2024 | పేజీలు : 5 | వెల :4/-

# రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి
- అవిశ్వాస తీర్మానంపై 50 మంది విపక్ష సభ్యుల సంతకాలు
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఇండియా కూటమి
- సభలో మైక్ ఇవ్వడం లేదనే ఆరోపణలతో అవిశ్వాస తీర్మానం
- ఇచ్చిన వెంటనే కట్ చేస్తున్నారని విపక్షాల ఆరోపణ



**న్యూఢిల్లీ :** రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎగువ సభలో చైర్మన్ వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ఎంపీలు ఆరోపిస్తున్నారు. రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా కూటమి పార్టీలైన తృణమూల్, ఆమ్ ఆద్మీపార్టీ, సమాజ్ వాదీపార్టీ, డీఎంకే, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఎంపీలు సంతకాలు చేసిన ఈ నోటీసులను రాజ్యసభ సెక్రటేరియట్‌కు సమర్పించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి.

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు. దీంతోనే ఆయనపై అవిశ్వాసతీర్మానం పెట్టినట్లు విపక్షాలు వెల్లడించాయి.. పార్లమెంటు ఉభయసభలు రేపటికి వాయిదా పడ్డాయి. అదానీ, సోరోస్ అంశాలపై విపక్షాలు ఆందోళన చేయడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. వరుస నిరసనలు చేయడంతో విపక్ష నేతలతో రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్కర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విపక్ష సభ్యుల తీరుపట్ల రాజ్యసభ చైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంటులో విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. సభలో విపక్షాలు హుందాగా ప్రవర్తించాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సూచించారు. పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాలు కొన్ని రోజులుగా నిరసనలు చేయడంపట్ల అసహనం వ్యక్తం చేశారు. పోస్టర్లు, మాస్కులు ధరించి నినాదాలు చేస్తున్నారని, విపక్ష సభ్యుల తీరు సరిగా లేదని, వారు హుందాగా ప్రవర్తించాలన్నారు.




## ఇక మహిళలకు పండుగే పండుగ - సంక్రాంతి నుంచి ఫ్రీ బస్సు..

**అమరావతి :** రాష్ట్రంలో మహిళలకు కూటమి ప్రభుత్వం శుభవార్త వినిపించింది . సంక్రాంతి పండుగ నుండి మరొక పథకాన్ని అమలు చేయడానికి కసరత్తు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అత్యంత ముఖ్యమైన ఉచిత బస్సు ప్రయాణ పథకం పైన ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తుందని ఈ పథకం అమలులో భాగంగా బస్సులకు కొరత లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే విషయాన్ని రవాణ శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ధృవీకరించారు..

**ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేకుండా ..**

ఈ పథకం కారణంగా ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలాగా వారిని దృష్టిలో పెట్టుకుని విధివిధానాలను రూపొందించే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని సమాచారం . ఇక సంక్రాంతి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తే నెలకు 250 కోట్ల రూపాయల వరకు భారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ క్రమంలో ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఏ సర్వీసులకు వర్తింప చేయాలన్న అంశం పైన కూటమి సర్కార్ ఫోకస్ పెట్టింది. అంతేకాదు ఎంత పరిమితి వరకు దీనిని అమలు చేయాలన్న దాని పైన కూడా దృష్టి సారించి పక్కాగా ఈ పథకాన్ని అమలులోకి తీసుకురానుంది.

## పార్లమెంట్ వద్ద విపక్ష ఎంపీల విన్నూత నిరసన..



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల రగడ కొనసాగుతూనే ఉంది. ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో ఆయనపై జేపీసీ విచారణ చేపట్టాలంటూ గత కొన్నిరోజులుగా పార్లమెంట్ లోపల, వెలుపల విపక్ష సభ్యులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం సైతం విపక్ష పార్టీల సభ్యులు తమ నిరసనను కొనసాగించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అదానీ చిత్రాలతో పాటు 'మోదీ అదానీ భాయ్ భాయ్' నినాదాలతో ముద్రించిన బ్యాగులు చేత్తో పట్టుకొని పార్లమెంటు వద్ద కాంగ్రెస్, విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. ప్రియాంక చేతిలోని ఆ బ్యాగును పరిశీలించి చూడండి

మిగతా 2లో

## మీ దుశ్శాసన పర్వానికి ఆడబిడ్డలు తగిన బుద్ది చెబుతారు : కెటిఆర్



**హైదరాబాద్:** కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని ఆశా వర్కర్లు నిరసన తెలిపితే కనీసం మహిళలు అని కూడా చూడకుండా ఈడ్చుకొని వెళ్తారా? అంటూ రేవంత్‌ను నిలదీశారు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ .. నిన్న పోలీసుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఆశావర్కర్లను ఉస్మానియా ఆస్పత్రిలో నేడు పరామర్శించారు.. వారికి ధైర్యం చెప్పారు.. వారు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తునట్లు చెప్పారు. ఆనంతరం ఆయన మీడియాతో

మిగతా 2లో



## కాంగోలో అంతుచిక్కని వ్యాధితో 143 మంది మృతి

- పిల్లలకే ఎక్కువగా సోకుతోందన్న వైద్యులు
- క్వాంగో ప్రావిన్స్‌లో 406 కేసులు నమోదు
- ఏంటీ వ్యాధి, ఎందుకు సోకుతోందనే వివరాలు చెప్పలేకపోతున్న డాక్టర్లు

**ఆఫ్రికా :** ఆఫ్రికా దేశం కాంగోను అంతుచిక్కని వ్యాధి వణికిస్తోంది. ఫ్లూ లక్షణాలతో ఎక్కువగా పిల్లలకు సోకుతున్న ఈ వ్యాధితో అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 143 మంది చనిపోయారని అక్కడి వైద్యులు వెల్లడించారు. ఇందులో ఐదేళ్ల లోపు చిన్నారుల సంఖ్యే ఎక్కువని తెలిపారు. వ్యాధి ఎందుకు, ఎలా సోకుతోందనే వివరాలు డాక్టర్లకు కూడా తెలియడంలేదట. ఈ మిస్టరీ వ్యాధిని వారు 'డిసీజ్ ఎక్స్' గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం కాంగోలోని క్వాంగో ప్రావిన్స్ లో డిసీజ్ ఎక్స్ కేసులు 406 నమోదయ్యాయని అధికారులు తెలిపారు.
ఈ అంతుచిక్కని వ్యాధితో ఆసుపత్రిలో చేరకుండానే మరికొందరు చనిపోయి ఉండొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాంగోలో పేదరికం కారణంగా పిల్లల్లో పౌష్టికాహార లోపం సర్వసాధారణమని గుర్తుచేశారు. ఈ కారణంగానే డిసీజ్ ఎక్స్ ఎక్కడ మొదలైంది, ఎలా వ్యాపిస్తోందనే

మిగతా 2లో

## యుద్ధరంగంలో కలం యోధులు - విధి నిర్వహణలో అమరులైన 104 మంది జర్నలిస్టులు

- ప్రాణాలకు తెగించి వార్తా సేకరణ
- విధి నిర్వహణలో ఒక్క ఏడాదిలో104 మంది జర్నలిస్ట్ లు మృతి
- ఒక్క గాజాలోనే 81 మంది విలేఖరులు ప్రాణ త్యాగం




2



## ఉద్యమకారులతో పెట్టుకోవద్దు - రేవంత్‌కు కవిత వార్నింగ్

2

## త్వరలో కొత్త డీజీపీ.. రేస్‌లో హరీష్ గుప్తా



2



2లో

## బలహీన వర్గాలకు టీడీపీలోనే ప్రాధాన్యం.. మంత్రి కొలుసు

## రాజ్యసభ కూటమి అభ్యర్థుల నామినేషన్స్

- పోటీకి వైసిపి దూరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యే ఛాన్స్
- నామినేషన్స్ పత్రాల పరిశీలన అనంతరం ప్రకటన



2లో

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# ఉద్యమకారులతో పెట్టుకోవద్దు - రేవంత్‌కు కవిత వార్నింగ్

**హైదరాబాద్ :** హస్తం గుర్తుతో ఉన్న తెలంగాణ తల్లి మాకు వద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ భవన్ లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతంతో నేడు అభిషేకం చేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులతో రేవంత్ రెడ్డి పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఉద్యమకారులతో పెట్టుకున్న వాళ్ళు ఎవరూ బాగుపడలేదన్నారు. ఉద్యమ కారులతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో మీ గురువు చంద్రబాబును అడుగు అని కీలక వ్యాఖ్యలు చేశారు.

**రేవంత్ పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరు**

ప్రపంచంలో అందరూ పూలతో దేవుని పూజిస్తే తెలంగాణలో మాత్రమే పూలను పూజిస్తామన్నారు. యూనిక్ ఐడెంటిటీ గా ఉన్న బతుకమ్మను మాయం చేశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ నీ మాయం చేసి కాంగ్రెస్ గుర్తు పెట్టారని మండిపడ్డారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి పెట్టిన విగ్రహంలో ఏం ప్రత్యేకత ఉందన్నారు. జొన్నలు, మక్కలు తమిళనాడు, కర్ణాటకలో పండించరా? అని ప్రశ్నించారు. తెలంగాణలో జరుపుకునే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మకు కాంగ్రెస్ హస్తం గుర్తు పెట్టి ఇదే తెలంగాణ తల్లి అంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ కారులకు నజరానా ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. మహిళలకు విగ్రహాలు పెట్టి పురుషులకు వరాలు ఇస్తున్నారన్నారు. బెల్లి లలిత, మల్లు స్వరాజ్యం, సంధ్య, విమలక్క, ఇతర తెలంగాణ మహిళా మణులకు గుర్తింపు ఏది? అని సీఎంను ప్రశ్నించారు. తెలంగాణ మహిళలు ఎప్పటికీ పేదగానే ఉండాలా అన్ని రేవంత్ ను నిలదీశారు కవిత. మీ నోటి నుంచి ఎరుకల నాంచారమ్మ, బీడీ కార్మికుల మహిళల పేరు రాలేదన్నారు. ఉద్యమ కాలంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ తల్లిని మార్చారని విమర్శించారు. విగ్రహం పెట్టామని చెప్పి సామన్య మహిళలకు ఇచ్చిన హామీలు ఎగ్గొడతారా అని నిలదీశారు. కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఉద్యమ తల్లే మా తల్లి హస్తం గుర్తు తల్లిని ఆమోదించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాత్రమే పెట్టుకోవాలని ప్రభుత్వం గెజిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించాలన్నారు. ఉద్యమకాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజలు కోరుకున్నారని కవిత అన్నారు. ప్రభుత్వం ప్రజలను భయపెట్టడం సరికాదన్నారు. అయినా మీ ఉడుత ఊపులకు ఎవరు భయపడరని రేవంత్ కు తేల్చి చెప్పారు.

**ఆశా వర్కర్లపై దాడి..** నిన్న ఆశా వర్కర్ల మీద ప్రభుత్వం చేసిన దాష్టికాన్ని ఖండిస్తున్నామన్నారు కవిత. వారికి తమ పూర్తి మద్దతునిస్తున్నామని తెలిపారు. ఒకవైపు మహిళల పేదలుగా చూడాలనుకుంటున్న రేవంత్ మరోవైపు మహిళలపై దాడులు చేయిస్తున్నారని కవిత మండిపడ్డారు.

# త్వరలో కొత్త డీజీపీ.. రేస్‌లో హరీష్ గుప్తా

- ఈ నెలాఖరులో ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ
- సమర్ధుడైన ఐఎఎస్ అధికారి కోసం సెర్చింగ్
- రేస్‌లో ముందున్న హరీష గుప్తా

**అమరావతి :** కొత్త ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త డీజీపీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమల రావు ఏడాది చివరిలో రిటైర్ కానున్నారు. ఆయన పదవికాలం పొడిగించే అవకాశం లేదని సమాచారం .

ఇప్పటి వరకూ చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పొడిగించేవారు కానీ డీజీపీ పదవి కాలాన్ని పొడిగించిన సందర్భాలు లేవు. ఇక ద్వారకా తిరుమలరావు పదవి కాలం పొడిగింపునకు చంద్రబాబు ప్రయత్నం చేస్తారా మరొకరికి చాన్సిస్తారా అన్నది త్వరలో తెలియనుంది. ఇప్పటికే ఆయన రిటైర్మెంట్ డేట్ పై సీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎస్ అధికారుల్లో అత్యంత సీనియర్ ద్వారకా తిరుమలరావు, ఎన్నికల సంఘం ఎన్నికల సమయంలో రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా తప్పించింది.

సీనియర్టీలో మొదటిస్థానంలో ఉన్న ద్వారకా తిరుమలరావును కూడా కాదని హరీష్ కుమార్ గుప్తాకు చాన్సిచ్చింది ఎన్నికల సంఘం. ప్రభుత్వం ఏర్పడిన తరవాత కొన్నాళ్లు గుప్తానే డీజీపీగానే ఉన్నారు కానీ తర్వాత ద్వారకా తిరుమలరావుకు చాన్సిచ్చారు.

**సీనియార్టీకే పెద్ద పీట..** ఇక చంద్రబాబు డీజీపీ విషయంలో నిబంధనల ప్రకారం వెళ్తారు. సీనియార్టీకి గౌరవం ఇస్తారు. అదేసమయంలో సమర్థత చూస్తారు.

సీనియార్టీ ఉన్నా అంచనాలకు అనుగుణంగా పని చేస్తారని అనుకోకపోతే పదవి ఇవ్వరు. దీంతో ద్వారకా తిరుమలరావు తర్వాత మళ్లీ హరీష్ గుప్తాకే చాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

# మీ దుశ్శాసన పర్వానికి ఆడబిడ్డలు తగిన బుద్ధి చెబుతారు : కెటిఆర్

మాట్లాడుతూ, పోలీసులతో రేవంత్ సర్కార్ చేసిన దుశ్శాసన పర్వం తెలంగాణ ఆడబిడ్డలు మరిచిపోరన్నారు. తగిన సమయంలో ఆడబిడ్డలు కాంగ్రెస్ కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హామీల అమలుకు ఆశా వర్కర్లు ఆందోళన చేస్తున్నారని.. నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఆశావర్కర్లు సేవలందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు ఆందోళన చేపట్టారని వివరించారు. వారిపై జరిగిన దౌర్జన్య ఘటనపై మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్లో ఫిర్యాదు చేస్తామన్నారు కెటిఆర్ . ఆడబిడ్డలపై చేయి చేసుకున్న పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.. ఆశా వర్కర్ల తరఫున ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తామని తేల్చి చెప్పారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం అని కేటీఆర్ అన్నారు.

# యుద్ధరంగంలో కలం యోధులు - విధి నిర్వహణలో అమరులైన 104 మంది జర్నలిస్ట్‌లు

**కాలిఫోర్నియా :** కాలిఫోర్నియా ప్రపంచంలో ఏమూల ఏం జరిగినా, అది సంతోషకరమైన వార్తయినా, కన్నీళ్ళు పెట్టించే సమాచారమైనా ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టు లు కీలకపాత్ర . ఇటీవల కాలంలో యుద్ధరంగంలో సైతం ప్రాణాలకు తెగించి కలం వీరులు వార్తల సేకరణ చేసి ప్రజలకు అందజేస్తున్నారు. ఈక్రమంలో గాజాలో నెలకొన్న ఉద్రిక్తతలకు సంబంధించిన విషయాలను ప్రపంచానికి తెలియజేయాల్సిన జర్నలిస్టులు అదే యుద్ధంలో మరణించడం విచారకరం. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 104 మంది జర్నలిస్టులు మృతి చెందారు. అందులో81 మంది గాజా లోనే మరణించడం గమనార్హం. ఈమేరకు ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఓ నివేదికలో వెల్లడించింది. ఏడాదిలో 104 మంది జర్నలిస్టులు మృతి చెందారు. అయితే, 2023 ఏడాదిలో ఆ సంఖ్య 129గా ఉంది. అయినప్పటికీ అత్యంత ఘోరమైన సంవత్సరాల్లో 2024 నిలిచిందని ఐఎఫ్‌జే ప్రధాన కార్యదర్శి ఆంథోనీ బెల్లాంగర్ పేర్కొన్నారు.

2023 అక్టోబరు 7న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 14 నెలల కాలంలో గాజాలో కనీసం 138 మంది జర్నలిస్టులు మృతి చెందారు. వారిలో చాలామందిని ఉద్దేశపూర్వకంగా చంపేయగా మరికొందరు యుద్ధంలో మరణించారు అని తెలిపారు. ఆసియాలో 20 మంది జర్నలిస్టులు మృతి చెందినట్లు తెలిపింది. వారిలో ఆరుగురు పాకిస్థాన్ లో, ఐదుగురు బంగ్లాదేశ్ , నలుగురు ఉక్రెయిన్ యుద్ధంలో, ముగ్గురు భారత్ లో మరణించినట్లు పేర్కొంది

**జైళ్లలో మగ్గుతున్న 520 మంది వార్తాహరులు**

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా 520 మంది జర్నలిస్టులు జైలులో ఉన్నట్లు ఐఎఫ్‌జే తెలిపింది. గతేడాది ఈ సంఖ్య 427గా ఉంది. ఇందులో చైనా మొదటిస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. దాదాపు 135 మంది జర్నలిస్టులను హాంకాంగ్‌లో నిర్బంధించినట్లు పేర్కొంది.. ప్రభుత్వ చర్యలను ప్రశ్నించిన జర్నలిస్ట్ లే అధికంగా జైలులో ఉంటున్నారని నివేదిక వెల్లడించింది.

## కాంగోలో అంతుచిక్కని వ్యాధితో 143 మంది మృతి

వివరాలు గుర్తించడం సమస్యగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ వో) నిపుణులు వివరించారు. ఈ వ్యాధిపై పరిశోధన కోసం నిపుణుల బృందాలను కాంగోకు పంపించామని, వ్యాధి ప్రబలుతున్న ప్రాంతాల్లో రోగుల నుంచి నమూనాలను సేకరించి విశ్లేషిస్తున్నామని డబ్ల్యూహెచ్ వో ఓ ప్రకటనలో తెలిపింది. వ్యాధి మూలాలను, కారకాలను గుర్తించి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపింది.

**వ్యాధి లక్షణాలు ఇవే..**

జ్వరం, ఒళ్లు నొప్పులు..
తలనొప్పి..
దగ్గు..
జలుబుతో ముక్కు కారడం..
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది...
రక్తహీనత..

## పార్లమెంట్ వద్ద విపక్ష ఎంపీల విన్నూత నిరసన..

ఎంత క్యూట్ గా ఉందో అంటూ రాహుల్ పేర్కొన్నారు. ఆ బ్యాగ్‌పై ఒకవైపు మోదీ, మరోవైపు అదానీ బొమ్మ ఉంది. మోదీ అదానీ భాయ్ భాయ్ అని రాసి ఉంది. ఇంతలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. సభా కార్యక్రమాల్లో మేం పాల్గొనాలను కుంటున్నాం. కానీ, ప్రభుత్వం చర్చను కోరుకోవడం లేదని అన్నారు. ఏదో ఒక సాకుతో సభా కార్యక్రమాలను వాయిదా వేస్తున్నారని ప్రియాంక అన్నారు.

## చలికాలంలో విటమిన్ సి అధికంగా ఉండే వీటిని తప్పక తినాల్సిందే..!




చలికాలంలో మనకు సహజంగానే పలు అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. చలి ఎక్కువయ్యే కొద్దీ శరీరం మరింతగా శ్రమించాల్సి వస్తుంది. శరీరం తనను తాను వేడిగా ఉంచుకునేందుకు యత్నిస్తుంది. దీంతో పెద్ద మొత్తంలో శక్తిని ఖర్చు చేస్తుంది. అలాగే చలికి రక్తనాళాలు సైతం కుచించుకు పోతాయి. దీంతోపాటు రక్తం గడ్డ కడుతుంది. ఫలితంగా బీపీ పెరిగి హార్ట్ ఎటాక్ వస్తుంది. చలికాలంలో చాలా మంది అందువల్లనే హార్ట్ ఎటాక్ బారిన పడుతుంటారు. అలాగే ఈ సీజన్‌లో మన ఇమ్యూనిటీ పవర్ సైతం తగ్గుతుంది. దీంతో పలు రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా మన శరీరంపై దాడి చేస్తుంటాయి. అందువల్ల చలికాలంలో మనం తీసుకునే ఆహారంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా విటమిన్ సి ఉండే ఆహారాలను తింటే మనకు ఎంతో మేలు జరుగుతుంది. విటమిన్ సి యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. ఇది చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది.

**విటమిన్ సి నీటిలో కరుగుతుంది..**

విటమిన్ సి నీటిలో కరిగే పోషక పదార్థం. అందువల్ల మనం విటమిన్ సి ని ఎక్కువగా తీసుకున్నా శరీరం తనకు కావల్సినంత విటమిన్ సి ని మాత్రమే ఉపయోగించుకుంటుంది. మిగిలిన విటమిన్ సి మూత్రం ద్వారా బయటకు వస్తుంది. మనకు రోజూ శరీరానికి తగినంత విటమిన్ సి అవసరం ఉంటుంది. కెనడాకు చెందిన మెడికల్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితం అయిన అధ్యయనం ప్రకారం విటమిన్ సిని మనం తగినంతగా తీసుకుంటే చలికాలంలో మనకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని తేలింది. కనుక ఈ సీజన్‌లో విటమిన్ సి ఉండే ఆహారాలను మనం ఎక్కువగా తినాల్సి ఉంటుంది.

**కివీ పండ్లు..** మరో అధ్యయనం చెబుతున్న ప్రకారం విటమిన్ సి ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల జలుబు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని తేల్చారు. కాబట్టి మన శరీరానికి సరిపడా విటమిన్ సి లభించేలా చూసుకుంటే జలుబు నుంచి దూరంగా ఉండవచ్చు. మనకు విటమిన్ సి అనేక రకాల ఆహారాల్లో సమృద్ధిగా లభిస్తుంది. ముఖ్యంగా కివీ పండ్లలో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండ్లను 100 గ్రాముల మేర తింటే సుమారుగా 161.3 మిల్లీగ్రాముల మేర విటమిన్ సిని పొందవచ్చు. విటమిన్ సి మనకు కివి పండ్ల ద్వారా అధికంగా లభిస్తుంది. ఒక కివి పండును తింటే చాలు మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 230 శాతం వరకు అదనంగా లభిస్తుంది.

# బలహీన వర్గాలకు టీడీపీలోనే ప్రాధాన్యం.. మంత్రి కొలుసు

**అమరావతి :** బలహీన వర్గాల వారికి చట్టసభల్లో సముచితమైన స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, రాజ్యసభకు జరుగుతున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రెండు స్థానాలు బలహీనవర్గాల వారికి కేటాయించి రాజకీయంగా సముచిత స్థానం కల్పించిందని రాష్ట్ర గృహ నిర్మాణ అండ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం కూటమి సభ్యుల నామినేషన్ కార్యక్రమానికి హాజరైన మంత్రి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. బలహీన వర్గాల వారికి రాజకీయంగా గుర్తింపు తీసుకురావడమే గాక దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీ అధ్యక్ష పదవిని ఒక బలహీన వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించడం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు.

గతంలో బలహీనవర్గాలని బ్యాక్ బోన్ గా ప్రచారం చేసుకున్న పార్టీలు వారికి చట్టసభల్లో కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, బలహీనవర్గాల వారిని వాడుకోవడానికి గత ప్రభుత్వాలు చేశాయని మంత్రి విమర్శించారు. ఒక రాజకీయ పార్టీకి జీవితకాలం అధ్యక్షుడిగా ఉండాలని గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పార్టీలో తీర్మానం చేయించుకున్నారని, ఆ తీర్మానాన్ని ఎన్నికల సంఘం అనుమతించలేదని, కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం బలహీన వర్గాల వారికి అధిక ప్రాధాన్యమిస్తూ పార్టీ పరంగా, ప్రభుత్వపరంగా అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో కేబినెట్ లో ఉన్న మంత్రులు ఏ విధమైన చర్చల్లో పాల్గొనేవారు కాదని, కానీ ప్రస్తుతం ప్రభుత్వంలో బలహీన వర్గాలకు చెందిన మంత్రులు కేబినెట్ సమావేశాల్లో ఏ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా దాని గురించి వివరంగా చర్చిస్తున్నారని మంత్రి పార్ధసారధి తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో సముచిత న్యాయం పాటించారని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పడిన పరిస్థితుల వల్ల గతంలో రాష్ట్రం నుంచి వెళ్ళిపోయిన పారిశ్రామిక వేత్తలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నారని మంత్రి పార్థసారధి వివరించారు.

# రాజ్యసభ కూటమి అభ్యర్థుల నామినేషన్స్

**అమరావతి :** రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు కూటమి అభ్యర్థులుగా టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీశ్, బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యలు నేడు తమ నామినేషన్ లు దాఖలు చేశారు.. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను బలపరుస్తూ, 10 మంది చొప్పున కూటమి ఎమ్మెల్యేలు సంతకాలు చేశారు.వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎంపిక ఏకగ్రీవం కానుంది. కాగా, నామినేషన్ల అనంతరం అభ్యర్థులు మాట్లాడుతూ, కూటమి ఆశయాలకు అనుగుణంగా తమ గళాన్ని పెద్దల సభలో వినిపిస్తామన్నారు..

**బిసి గళం వినిపిస్తా – కృష్ణయ్య...**

చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం పోరాటం చేస్తానని తెలిపారు బిజెపి అభ్యర్థి కృష్ణయ్య. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పిలిచి తనకు రాజ్యసభ టికెట్ ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు తనను రాజకీయాల్లోకి పిలిచారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని చెప్పారు..50 ఏళ్లు బీసీల కోసం పోరాటం చేశానని చెప్పారు. వైసీపీకి పార్టీలో మాట్లాడే అవకాశం తక్కువ అని.. బీసీల గురించి ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీ మారానని తెలిపారు. బీజేపీ తనకు కొత్త కాదని, తాను కండువా కప్పుకున్న మొదటి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. పార్టీల కండువాలు వేసుకోలేదు. అన్ని పార్టీలు బీసీల కోసం న్యాయం చేస్తున్నాయని చెప్పారు. పార్టీలే తన దగ్గరకు వచ్చాయని బీజేపీ అభ్యర్థి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు.

**ఏపి అభివృద్ధికి పాటు పడతా – బీదా మస్తాన్ రావు...**

రాష్ట్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థి బీదా మస్తాన్ రావు తెలిపారు. అనివార్య కారణాల వల్ల రెండున్నరేళ్లు తెలుగుదేశానికి దూరమయ్యానని అన్నారు. సొంతిల్లు లాంటి తెలుగుదేశంలో కొంతకాలం లేకపోవడం ఎంతో బాధించిందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు కీలక పదవులు ఆపార్టీలో దక్కుతున్నాయని బీదా మస్తాన్ రావు తెలిపారు.

**బాధ్యతతో నిర్వర్తిస్తా: సానా సతీష్...**

చిన్న వయస్సులోనే నాకు కీలక పదవి ఇచ్చి ప్రోత్సహించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు రాజ్యసభ అభ్యర్థి సానా సతీష్ ధన్యవాదాలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని బాధ్యతతో నిర్వర్తిస్తానని సానా సతీష్ చెప్పారు.

# చరిత్ర తెలియని దద్దమ్మలు

- కాంగ్రెస్ సన్నాసులతో అప్రమత్తంగా ఉండాలి
- ఏ పథకమూ అమలు చేయకుండానే విజయోత్సవాలా?
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. బీఆర్ఎస్‌దే గెలుపు
- 420 హామీలపై పోరాటాలకు సిద్ధం కావాలి
- మేడ్చల్‌లో జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



**మేడ్చల్/దుండిగల్:** రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, 90 నుంచి 100 సీట్లు గెలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం గండిమైసమ్మలో నిర్మించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. రుణ మాఫీ చేసినట్లు గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో ఒక్కరికీ రుణమాఫీ ఎందుకు కాలేదని కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ సభలో ప్రసంగిస్తున్న సమయంలో రుణ మాఫీకి సంబంధించిన పలు పత్రాలను బాధిత రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ ఒక్క ఘట్‌కేసర్ మండలంలోనే రుణమాఫీ అయ్యే రైతులు 1189 మంది ఉంటే ఒక్కరికీ కూడా రుణమాఫీ కాలేదని రికార్డులు చూపిస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రుణమాఫీ రైతులందరికీ చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.కాంగ్రెస్ సన్నాసులకు ఇదొక్కటి సాక్ష్యం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు అమలు జరిగేలా ప్రజలకు మద్దతుగా ప్రజా పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. చరిత్రను తెలుసుకోలేని దద్దమ్మలు కాంగ్రెస్ సన్నాసుల పట్ల అప్రమత్తంగా ఉండకపోతే తెలంగాణను నిండా ముంచుతారన్నారు.



**ఏ ఎన్నిక వచ్చినా..**

రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా.. బీఆర్ఎస్‌దే గెలుపు ఉండేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఏ ఒక్క పథకం అమలు చేయకుండానే ప్రజాపాలన పేరిట విజయోత్సవాలను నిర్వహిస్తూ ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే బూత్ స్థాయి నుంచి సభ్యత్వాలను చేస్తూ.. పూర్తిస్థాయిలో కమిటీలను వేసుకొని పార్టీకి పునర్వైభవాన్ని తీసుకొచ్చేలా నూతన ఒరవడికి శ్రీకారం చుడుతామన్నారు.

# దేశ రాజకీయాల్లో తీవ్ర విషాదం.. కర్ణాటక మాజీ సీఎం కన్నుమూత



**కర్ణాటక :** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రిగా, మాజీ కేంద్రమంత్రిగా, మాజీ గవర్నర్‌గా ఎనలేని సేవలు అందించిన ఎస్ఎం కృష్ణ బెంగళూరులో ఈరోజు కన్నుమూశారు. 92 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన వృద్ధాప్య సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఈరోజు ఉదయం మృతిచెందారు.

కర్ణాటక నాయకుడు, మాజీ విదేశాంగ మంత్రి, మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ ఈరోజు తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో బెంగళూరులోని సదాశివనగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. 92 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన వృద్ధాప్య సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం తొలుత వైదేహి ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. డా. సత్యనారాయణ మైసూర్, డా. సునీల్ కారంత్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందించింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. దీంతో వైద్యులు ఆయను ఐసీయూలో చేర్చి చికిత్స అందించారు. మే 1, 1932న కర్ణాటకలోని మాండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్లి గ్రామంలో జన్మించిన ఎస్ఎం కృష్ణ పూర్తి పేరు సోమనహళ్లి మల్లయ్య కృష్ణ.. ఆయన తన ప్రాథమిక విద్యను హత్తూరులో, సెకండరీ విద్యను మైసూర్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాశాలలో, తన బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌ని మైసూర్‌లోని మహారాజా కాలేజీలో, లా డిగ్రీని యూనివర్సిటీ లా కాలేజీలో పూర్తి చేశారు.

డల్లాస్, టెక్సాస్,లోని సదరన్ మెథడిస్ట్ విశ్వవిద్యాలయం, వాషింగ్టన్‌లోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్శిటీ లా స్కూల్ నుండి ఎస్ఎం కృష్ణ పట్టభద్రుడయ్యాడు. 1962లో మద్దూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది ఆయన రాజకీయంలోకి రంగప్రవేశం చేశారు. ఆ తర్వాత 'ప్రజా సోషలిస్టు పార్టీలో' చేరారు.

అయితే 1967 ఎన్నికల్లో మద్దూరు నుంచి కాంగ్రెస్‌కు చెందిన ఎంఎం గౌడ్‌పై ఓడిపోయారు. 1968లో సిట్టింగ్ ఎంపీ మరణించడంతో మాండ్య లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1968 ఉప ఎన్నికల తర్వాత మాండ్య నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 1971, 1980 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. మాండ్యాను కాంగ్రెస్ కంచుకోటగా నిలబెట్టడంలో ఎస్ఎం కృష్ణ పాత్ర కీలకం అని చెప్పవచ్చు.

1999లో కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించారు. ఆ సందర్భంగా ఎస్ఎం కృష్ణ చేపట్టిన పాంచజన్య యాత్ర కర్ణాటక ప్రజల్లో కాంగ్రెస్‌కు మంచి ఆదరణ తెచ్చిపెట్టింది. డిసెంబర్ 2004లో మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన కృష్ణ 5 మార్చి 2008న మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. తర్వాత రాజ్యసభకు ఎన్నికై, 2009 మే 22న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

తన రాజకీయ జీవితమంతా కాంగ్రెస్‌లో బలమైన నాయకుడిగా కొనసాగిన ఎస్ఎం కృష్ణ తన రాజకీయ జీవితం ముగిశాక జనవరి 29, 2017న కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. 2017 మార్చిలో అధికారికంగా బీజేపీలో చేరారు. అనారోగ్యం కారణాల వల్ల 7 జనవరి 2023న రాజకీయాల నుండి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. %వాపీ% కృష్ణ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY
బుధవారం11 డిసెంబర్ 2024

# ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి




ములుగు ప్రతినిధి( మన వెలుగు ) డిసెంబర్ 10స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా

రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12 వ తేదీ లోపు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. రాజకీయ పార్టీలను కోరారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, డి పి ఓ దేవ్ రాజ్ లతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ నెల 7 వ తేదీన జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామని గుర్తు చేశారు. జిల్లాలో మొత్తం 174 గ్రామ పంచాయ తీలు, 1556 వార్డులు ఉండగా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 1451 తో పాటు అదనంగా 26 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని వివరించారు. ఈ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 12 వ తేదీలోపు తెలుపవచ్చుని, 12న అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు నిర్వహించే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను 13వ తేదీన పరిష్కరించడం జరుగుతుందని, అనంతరం ఈ నెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించబడుతుందని అన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 1100 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న సైబరాబాద్ పోలీసులు



**శేర్లింగంపల్లి (మన వెలుగు) డిసెంబర్ 10 :**క్రైమ్స్ డీసీపీ కె.నరసింహ, ఐపీఎస్ నేతృత్వంలో సైబరాబాద్ పోలీసులకు చెందిన సీసీఎస్, ఐటీ సెల్, సీసీఆర్బీ, క్యాట్, సోషల్ మీడియా బృందాలు గత 45 రోజులుగా చోరీకి గురైన 1,100 మొబైల్ ఫోన్‌లను విజయవంతంగా స్వాధీనం చేసుకున్నాయి. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సెయిర్ ) పోర్టల్‌ని ఉపయోగించి, రికవరీ చేయబడిన ఫోన్‌లు ₹ 3.30 కోట్ల విలువైనవి, సైబరాబాద్ సీపీ కార్యాలయంలో (10.12.2024) జరిగిన అధికారిక కార్యక్రమంలో వాటి నిజమైన యజమానులకు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా డీసీపీ క్రైమ్స్ డీసీపీ కె.నరసింహ, ఐపీఎస్ మాట్లాడుతూ.. మన దైనందిన జీవితంలో మొబైల్ ఫోన్‌లు కీలకపాత్ర పోషిస్తున్నందున, సైబర్ నేరాల నుంచి పౌరులను రక్షించడంలో సైబరాబాద్ పోలీసుల నిబద్ధతను ఈ రికవరీ డ్రైవ్ నొక్కి చెబుతోంది. మొబైల్ దొంగతనం నిరంతరం సమస్యగా ఉంటుంది ఉన్నత స్థాయి విద్యార్హత ఉన్నప్పటికీ, చాలా మందికి తెలియకుండానే బ్యాంక్ ఖాతా వివరాలతో సహా సున్నితమైన సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి సైబర్ నేరగాళ్లచే దోపిడీ చేయబడింది వారి దొంగిలించబడిన పరికరాలు దుర్వినియోగం కాకుండా ఎలా నిరోధించాలో సెయిర్ పోర్టల్ అమలులోకి వచ్చినప్పటి నుండి, ఈ సంవత్సరం మాత్రమే 5,500 పరికరాలతో సహా 7,500 మొబైల్ ఫోన్‌లను పునరుద్ధరించడానికి ఇది సులభతరం చేసింది. పౌరులు వారి పరికరాలను భద్రపరచడం మోసపూరిత కాల్‌లు లేదా అనుమానాస్పదంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని మేము కోరుతున్నాము. బాధితులను మోసం చేయడానికి నేరస్థులు సాధారణంగా ఉపయోగించే ఆన్‌లైన్ లింక్‌లు. గడచిన 45 రోజుల్లో సైబరాబాద్ పోలీసులు 1,100 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో మాదాపూర్ సీసీఎస్ ద్వారా 235, బాలానగర్ సీసీఎస్ ద్వారా 203, మేడ్చల్ సీసీఎస్ ద్వారా 185, రాజేంద్రనగర్ సీసీఎస్ ద్వారా 166, శంషాబాద్ సీసీఎస్ ద్వారా 151, జెడ్చల్, మెడ్చల్ ద్వారా 185 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 07 ద్వారా మాదాపూర్ , 50 ద్వారా మేడ్చల్, 23 బాలానగర్, ఎల్ అండ్ ఓ 08 రాజేంద్రనగర్, 12 శంషాబాద్, 60 ఐటీ సెల్. మోసపూరిత కాల్‌లు, పెట్టుబడి మోసాలు లేదా ఇతర సైబర్ నేరాలకు ప్రతిస్పందనగా పౌరులు డిజిటల్ అరెస్టులకు లేదా భయాందోళనలకు భయపడవద్దని డిసిపి ఉద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సమాచారాన్ని ధృవీకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలను సైబరాబాద్ పోలీసులకు నివేదించాలని, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్ధారించాలని ఆయన కోరారు మీడియా ప్రచారాలు, సోషల్ మీడియా ఔట్రీచ్ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ మొబైల్ దొంగతనం నివారణ సైబర్ మోసం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. దొంగతనాలను అరికట్టడానికి నేరస్థులను గుర్తించడంలో సహాయపడటానికి నివాస వాణిజ్య ప్రాంతాలలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయడం యొక్క ప్రాముఖ్యతను కూడా పోలీసులు నొక్కిచెప్పారు. డీసీపీ ప్రజలను వారి సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో అందుబాటులో ఉన్న సెయిర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌లను నివేదించమని ప్రజలను ప్రోత్సహించారు. సెయిర్ పోర్టల్‌ను ఉపయోగించడం వల్ల దొంగిలించబడిన ఫోన్‌ల దుర్వినియోగాన్ని నిరోధించవచ్చని మరియు త్వరగా రికవరీ అవుతుందని ఆయన నొక్కి చెప్పారు. సైబర్ నేరాల కోసం, అతను పౌరులను 1930కి డయల్ చేయాలని లేదా సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ ని సందర్శించాలని దొంగతనం జరిగిన తర్వాత వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయాలని కోరారు. చాలా మంది వ్యక్తులు తమ కథనాలను పంచుకున్నారు పోయిన తమ ఫోన్‌లను తిరిగి పొందడానికి సహాయం చేసినందుకు సైబరాబాద్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. బస్టాప్‌లో ఫోన్ పోయిందని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఓ వ్యక్తి చెప్పాడు. ఇది దొరుకుతుందని అతను ఎప్పుడూ అనుకోలేదు, కానీ అతనిని ఆశ్చర్యపరిచే విధంగా, వారు దానిని రికవరీ చేశారని పోలీసుల నుండి కాల్ వచ్చింది. అతను చాలా సంతోషంగా కృతజ్ఞతతో ఉన్నాడు. 20,000 విలువైన తన ఫోన్‌ను పోగొట్టుకున్నానని, అది మంచిదే అయిందని భావించానని సెంట్రింగ్ వర్కర్ చెప్పాడు. పోలీసులు దానిని అతనికి తిరిగి ఇవ్వడంతో, అతను చాలా సంతోషించాడు వారి సహాయానికి వారికి కృతజ్ఞతలు తెలిపాడు. పోగొట్టుకున్న తన ఫోన్‌కు ఇప్పటికీ ఈఎంఐలు చెల్లిస్తున్నానని, అది పెద్ద ఆర్థిక భారంగా మారిందని మరో మహిళ షేర్ చేసింది. ఆమె తన ఫోన్‌ను తిరిగి పొందడం పట్ల ఉపశమనం సంతోషం కలిగింది వారి ప్రయత్నాలకు పోలీసులకి ధన్యవాదాలు తెలిపింది.డీసీపీ క్రైమ్స్ డీసీపీ కె. నరసింహ, ఐపీఎస్, సీసీఆర్బీ, క్రైమ్స్ ఏసీపీ కళింగరావు, సీసీఎస్ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, రాజేంద్రనగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పవన్, మాదాపూర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్, బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్‌లను అభినందించారు. రాజు, ఏఎస్సైలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, ఐటీ సెల్, సీసీఆర్బీ, సీసీఎస్ బృందాలు రికవరీ ఆపరేషన్‌లో తమ అత్యుత్తమ కృషికి కృషి చేశాయి.

# భూ తగాదాల నేపథ్యంలో ఒకరి హత్య

### ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

### ఒకరికి 5 సంవత్సరాల జైలు శిక్ష

**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని యమపూర్ గ్రామానికి చెందిన చెదుల రాజేందర్ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి కాస సంజీవ్ కి మధ్యలో వ్యవసాయ భూమికి సంబంధించినటువంటి తగదలు జరుగుతుండేవి. వీటిని మనుసులో పెట్టుకొని చెదుల రాజేందర్ ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో తేది 13 -01 -2022 న పొలంలో పనిచేస్తు ఒంటరిగా ఉన్న రాజేందర్ ను గమనించిన కాస సంజీవ్ మరో నిందితుడైన గోదురు గ్రామానికి చెందినా తైదపల్లి రజినీకాంత్ తో కలిసి తమ వెంట తెచ్చుకున్న కత్తితో రాజేందర్ మెడ పై, కడుపులో,కుడి చేతి పై విచక్షణారహితంగా పొడవుగా తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడికక్కడే మరణించడం జరిగింది. ఆ తర్వాత ఈ ఇద్దరు నిందితులు రాయికల్ మండలంలోని భూపతిపూర్ క్రమానికి చెందినా మూడవ నిందితుడు మంగలారపు లక్ష్మీనారాయణతో కలిసి కేసు కు సంబందిచిన సాక్ష్యదారాలను నాశనం చేసినారు. మృతుని బార్య లత ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిదితులు అయిన కాస సంజీవ్, తైదపల్లి రజినీకాంత్, మంగలారపు లక్ష్మీనారాయణ లను కోర్టులో హాజరు పరచడం జరిగింది. కేస్ ను విచారించిన న్యాయమూర్తి నారాయణ నింధితులైన కాస సంజీవ్, రజినీకాంత్ లకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి 10000 జరిమానా, మంగలారపు లక్ష్మీనారాయణ కు 5 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు 5000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ... సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.ఈ యొక్క కేస్ లో పీపీ గా మల్లేశం గారు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ గా ఇన్స్పెక్టర్ శ్రీను, ఎస్.ఐ ఉమాసాగర్,సీఎం ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబు ల్ కిరణ్ కుమార్ మరియు కోర్టు కానిస్టేబుల్ రంజిత్ నిందితుల కి శిక్ష పడడంలో కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహించడం జరిగింది. పై కేస్ లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటాం




## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో సవరించిన ఓటరు జాబితా ప్రకారము నాలుగు కొత్త గ్రామ పంచాయతీలు కలుపుకొని మొత్తం 400 గ్రామపంచాయతీలో 3368 వార్డుల్లో 3368 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పెరిగిన కొత్త గ్రామ పంచాయతీలలో ఖానాపూర్ మండలంలోని రంగపేట, కడెం మండలం న్యూ ధర్మాజీపేట, తానూర్ మండలం కళ్యాణి, కుబీర్ మండలం రాంసింగ్ తాండ గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,33,687 మహిళా ఓటర్లు, 2,12,517 పురుష ఓటర్లు, 15 మంది ఇతర ఓటర్లతో కలుపుకొని మొత్తం 4,46,219 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఓటరు జాబితా పై ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉన్నట్లయితే మండల స్థాయిలో జరగబోవు సమావేశంలో రాత పూర్వకంగా అధికారులకు వివరిస్తే, వాటిని విచారించి తుది జాబితాను ప్రకటిస్థామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిఎల్పిఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్ రెడ్డి, గంగ్రత్ రమేష్, సిరికొండ రమేష్, గాజుల రవి, మజార్, నరేష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**బాసర గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఆయన వివరణ ప్రకారం రెండో గాట్ వద్ద భక్తులు స్నానాలు చేస్తుండగా భక్తులకు ప్రతిదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే గంగపుత్రులతో మృతి దేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయసు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు

# నిధులను మంజూరు చేయండి



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 10 :**హైదరాబాద్ లోని శంషాబాద్ ఏరియాలో జరిగిన ఓ ప్రైవేటు షాది కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను నిర్మల్ జిల్లా బాసర గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ ఎస్.కె ఖలీల్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో బాసర మండల కేంద్రంలోని షాదిఖానా భవనం కొరకై 17 లక్షల రూపాయలు మంజూరు అయినప్పటికీ పనులు అర్ధాంతంగా ఆగిపోయాయని వెంటనే పనులను పున ప్రారంభించేందుకు ఎమ్మెల్సీ. అమీర్ ఆలీ ఖాన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, షబ్బీర్ అలీ రివ్యూ మీటింగ్ పెట్టి అన్ని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారని,అదేవిధంగా షాది ఖానా పనులతో పాటు షాది ఖానారోడ్డు పనులకు అదనంగా నిధులు మంజూరు చేసేందుకు మరో 20 లక్షల వరకు ప్రోసిడింగ్ ఇచ్చే విధంగా ఎమ్మెల్సీ కోటా నుండి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఎస్.కే ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అంతా మా ఇష్టం...

# వెనక్కు తగ్గిన ఆలయ ప్రకటన

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 10 :**ఈ నిరుద్యోగయువకులకు దిక్కెవరు... నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో 10 మంది అవుట్సోర్సింగ్ ద్వారా సెక్యూరిటీ ఉద్యోగాలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్న ఆలయ అధికారులు నేడు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రకటనను రద్దు చేశారు.. లినాడు టెండర్ అన్నారు.. నేడు టెండర్ ను రద్దు చేశారులి.. యువతకు ఉపాధి కల్పిస్తామన్న ఆలయ అధికారులపై రాజకీయ ఒత్తిడితో మళ్లీ వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. ఇటీవలె ఔట్సోర్సింగ్ సెక్యూరిటీ ప్రకటన వెలువడి ఎంతో సంతోషంగా యువతకు ఆసక్తిగా ఎదురుచూసినప్పటికి నిరుద్యోగయువతకు ఉపాధి దొరుకుతుందనే ఆశతో ఉన్న నిరుద్యోగులకు ఔట్సోర్సింగ్ సెక్యూరిటీ జాబితా నిరాశ కల్పించిందని అంటున్నారు స్థానిక యువకులు.

# నేడు జాతీయ మానవ హక్కుల దినోత్సవం




**ములుగు ప్రతినిధి( మన వెలుగు) డిసెంబర్ 10**జాతీయ మానవ హక్కుల దినోత్సవం సంధర్భంగా తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, డి పి ఓ దేవ్ రాజ్ లతో కలసి స్వచ్ఛ భారత్ కి సంభందించిన అవగాహణ మెటీరియల్ను, గోడ పత్రికలను అవిష్కరిం చడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు విధిగా మరుగుదొడ్లను నిర్మించుకోవాలనీ, ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతీ గ్రామాలలో తప్పనిసరిగా ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలు జరిగే విధంగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పౌరుడు విధిగా గ్రామాలలో వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచే విధంగా అవగాహణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రపంచ మర్గుదొడ్ల దినోత్సవం నవంబర్ 19న ప్రారంభమై ఈ రోజు ముగింపు కార్యక్రమము జరుపు కోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతీ గ్రామం నుండి 2 నుంచి 5 టాయిలెట్లను, ప్రతీ మండల స్థాయి నుండి 3 టాయిలెట్లను ఎంపిక చెయడం జరిగిందనీ అన్నారు.జిల్లా స్థాయిలో 5 స్వచ్ఛ సుందర్ సౌచాలయాలను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరిగింది.

### రాంటెక్ లో పశుగర్భకోశ చికిత్స అవగాహన శిబిరం



**ముధోల్ ( మన వెలుగు) డిసెంబర్ 10 :**ముధోల్ మండలంలోని రాంటెక్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ-పశుగణాభివృది సంస్థ ఆద్వర్యంలో ఉచిత పశుగర్భకోశ చికిత్స- అవగావాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరం లో ముఖ్య అతిధిగా పశుగణాభి వృద్ధి సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ అధికారి రామరావు మాట్లాడుతు... కృత్రిమ గర్భదారణ వలన కలిగే లాభాలు, దేశవాళీ పశువులకు మేలురకం వీర్య దానం వలన మేలు జాతి దూడలు పుట్టి పాల దిగుబడి పెరిగి రైతుల ఆర్థికంగా లాభం పోందుతారని తేలియజేశారు.ఈ కార్యక్రమంలో డా.రామారావు, సహయ సంచాలకులు డా. సురేష్, డా. రవీందర్, మండల పశు వైద్య అధికారిని డా. సౌదర్య, గోపాల మిత్ర, సూపర్ వైజర్ గోపాల్ , విజయ డైరి మెనేజర్ వెంకట సామి, గ్రామస్థులు లావణ్య, సంజీవ్, గోపాల మిత్రులు రమేష్, మదన్, మల్లేష్ పాల్గోన్నారు.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళ బృందం

# ద్వారా విద్యార్థులకు అవగాహన





**మెట్ పల్లి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్ పల్లి పట్టణం కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల లో పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకా లు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్టైతే 930 నంబర్ కి పిర్యాదు చేయాల ని, పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహకారలు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడు తూ.... మాదకద్రవ్యాల (పదార్థాల) దుర్వినియోగం ప్రపంచవ్యాప్త ముప్పుగా మారిన దాని గురించి చర్చించ డానికి మనందరం ఇక్కడ ఉన్నాము. ప్రపంచంలోని ఏ ప్రాంతం కూడా మాదకద్రవ్యాల శాపం నుండి విముక్తి పొందలేదు.మనందరికీ తెలిసినట్లుగా కొంతమంది వ్యక్తులు చాల మంది విద్యార్థులు మానసిక మరియు శారీరక ఆనందాల కోసం లేదా మరే ఇతర కారణాల వలన మాదక ద్రవ్యాలు తీసుకోవడం, పొగ త్రాగడం, మద్యపానం సేవించడం చేస్తుంటారు. ఇది చట్ట విరు ద్ధమైన విషయం. ఇలా చేయడం వలన దాని పర్యవ సానాలు పాల్గొన్న వ్యక్తిని మాత్రమే కాకుండా వారి కుటుంబం మరియు సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, తయారీ పంపిణీ మరియు అమ్మకాలు అనేవి ప్రపంచ అక్రమ వ్యాపారంలొ భాగం. భారతదేశంలో సాధారణంగా దుర్వినియోగం చేయబడిన డ్రగ్స్ గంజాయి(గ%శీ%జా), హెరాయిన్ మరియు కొకైన్ ఇవన్నీ డ్రగ్స్ తీసుకోవడం వలన ఆత్మహత్య ఆలోచనలు, డిప్రెషన్, ప్రవర్తనలొ మార్పు వంటి సమస్యలు తీవ్రమైన ప్రభావాలను చుపిస్తాయ్.మాదక ద్రవ్యాల వినియోగం ఈరోజుల్లో సర్వసాధారణంగా మారింది. చాలామంది యువత డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటు న్నారు. అందువల్ల మన యువతలో విద్యార్థుల్లో దీని గురించి అవగాహన పెంచడం, వారు దానికి లొంగిపో కుండా నిరోధించడం చాలా ముఖ్యం. మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 26న జరుపుకుంటున్నామని, మన విద్యార్థులు ఎప్పటికీ మాదక ద్రవ్యాల వినియోగం చేయ రని, అట్టి వాటికి దూరంగా ఉంటారని నేను హృదయపూ ర్వకంగా ఆశిస్తున్నాను. ఇది శిక్షార్హమైన నేరానికి దారితీస్తుంది. మన దేశానికి మీరు ఎంతో అవసరమని గుర్తించుకోండి. ఈ పోరాటంలో మనమందరం ఐక్యంగా నిలబడదామని, అలాగే విద్యార్థులు తల్లిదండ్రులకు, అధ్యాపకులు మరియు గ్రామ పెద్దలకు గౌరవం ఇవ్వాలని అధ్యాపకుల వద్ద నేర్చుకునే మేము ఈ స్థాయికి ఎదిగాము. ప్రపంచంలో ఎవరు ఎంత స్థాయికి ఎదిగిన ఉపాధ్యాయుల వద్ద పాఠాలు నేర్చుకున్న వారే అన్న విషయం తెలుసుకోవాలి. ప్రపంచం లొ ఉపాధ్యాయులకు ఉన్న గౌరవం ఎవరికీ ఉండదనే విషయం తెలుసుకో వాలి. మీరు కూడా గొప్ప గొప్ప స్థాయిలకి ఎదగాలని, ఇలాంటి స్టేజి మీదకు వచ్చి మాట్లాడే స్థాయికి ఎదగాలని మీ అందరిని కోరుకుంటున్నాను. ఇట్టి కార్యక్రమంలో సిఐ నిరంజన్ రెడ్డి, పోలీస్ కళా బృందం, పోలీస్ సిబ్బంది మరియు ఇన్చార్జి ప్రిన్సిపాల్ బొడ్డు శ్రీనివాస్, కట్ట జగపతి నరసయ్య, ఇతర అధ్యాపకులు మరియు 300 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని రక్షిస్తేనే హక్కులకు రక్షణ



### సహజ హక్కుల తర్వాతే అన్ని హక్కులు

### అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకల్లో మాడ భూషి శ్రీధర్

**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**భారత రాజ్యాంగాన్ని రక్షిస్తేనే మన హక్కులకు రక్షణ ఉంటుందని జాతీయ సమాచార కమీషన్ రిటైర్డ్ కమిషనర్, జాతీయ విద్యావేత్త మాడభూషి శ్రీధర్ అన్నారు. జగిత్యాల జిల్లా చలిగల్ ప్రాంతంలోని శ్రీ లక్ష్మీ నరింహ ఫంక్షన్ హాల్ లో మంగళ వారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ మానవ హక్కుల మండలి (ఎన్.జి. వో) జగిత్యాల జిల్లా అధ్యక్షులు నక్క గంగారాం అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. సంస్థ జాతీయ అధ్యక్షులు అయిల్నేని శ్రీనివాస్ రావు తో పాటు మాడభూసి శ్రీధర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ ..మానవులకు సహజ హక్కులే ఎక్కువగా ఉంటాయన్నారు. రాజ్యాంగ బద్ధంగా చట్టపరమైన హక్కులు వచ్చాయని వివరించారు. హక్కులు అడిగితే వస్తాయి తప్పా మౌనంగా ఉంటే ఏ హక్కు దరిచేరదు అని వివరించారు. మానవులలో ప్రశ్నించే తత్వం పెరుగాలని, జవాబు అడిగితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. యావత్ ప్రపంచంలో హక్కులను అడిగి పొందే హక్కు కేవలం భారత దేశంలోనే ఉందని వివరించారు. అది కూడా భారత రాజ్యాంగ పరంగా వచ్చిందన్నారు. సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు ఐల్నేని శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు, నిర్మాణం, సంస్థ సేవలు, ఇప్పటివరకు సంస్థ అభివృద్ధి చెందిన తీరు, అనతికాలంలోనే సాధించిన విజయాలను వివరించారు. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలకు నేషనల్ హుమాన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్.జి.ఓ.) ను విస్తరించ నున్నట్లు ఆయన తెలిపారు. వాఖ్యతగా హరి శంకర్ వ్యవహరించారు. సభాధ్యక్షులు అయిన జగిత్యాల జిల్లా అధ్యక్షులు నక్క గంగారాం మాట్లాడుతూ సంస్థ చేసిన సేవలు, సాధించిన విజయాలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. లక్ష్మారెడ్డి, సీనియర్ న్యాయవాది బండ భాస్కర్ రెడ్డి లు మాట్లాడుతూ చట్టాలు – హక్కులు, వాటిని సాధించే విధానాలను వివరించారు. సీనియర్ జర్నలిస్ట్, హక్కుల ఉద్యమ కారుడు చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కుల కార్యకర్తగా ఎదిగి ప్రశించినప్పుడే మన చట్టపరమైన హక్కులను సాధించుకోగలమని తెలిపారు. శ్రీనివాస్ రావు స్థాపించిన ఈ సంస్థ జాతీయ స్థాయిలో ఎదిగి, హక్కుల సాధనలో, సమాజసేవలో అగ్రస్థానంలో నిలవాలని ఆకాక్షించారు. ఈ సంస్థ నిర్వాహకులు, తాను ఈ మధ్య కాలంలో సాధించిన విజయాలను వివరించారు. జగిత్యాల బార్ అసోసియే షన్ అధ్యక్షులు డి.లక్ష్మా రెడ్డి, సీనియర్ న్యాయవాది బండ భాస్కర్ రెడ్డి, సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరమల్ల సందీప్, కార్యదర్శి నాగరాజు, సేర్ప్ ఎ.ఓ. శ్రీనివాస రావు, లంక దాసరి శ్రీనివాస్, రమేష్, అస్ఘర్ ఖాన్, గౌరిషెట్టి చంద్ర శేఖర్, హరిశంకర్, అప్పం చిన్నారెడ్డి, కొక్కుల ప్రభాకర్, ప్రశాంత్ రావు, కాసారాపు శంకర్ గౌడ్, డా. నక్క రాజు, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నేటితో 70 వసంతాల పూర్తి

### ప్రపంచ రాతి నిర్మాణాల

### ప్రాజెక్టుల్లోకెల్లా ప్రథమస్థానం

ప్రపంచప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగి నేటి (డిసెంబర్ 10)తో 69 వసంతాలు పూర్తిచేసుకుంది. ఆంధ్రరాష్ట్ర అన్నపూర్ణగా రైతులపాలిట కల్పతరువుగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబర్ 10న డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు ప్రముఖ ఇంజనీర్ కేఎల్ రావు, ముత్యాల జమీందార్ మహేశ్వరప్రసాద్ ఆలోచనలు మూలంగా చెప్పవచ్చు. ప్రాజెక్టు నిర్మాణానికి వేలాది మంది శ్రమజీవుల శ్రమశక్తి, వందలాది మంది ప్రాణార్పణలు నేటికీ మరువలేనివి. ఈ ప్రాజెక్టు నిర్మాణం 1970లో పూర్తయింది. డ్యాం నిర్మాణ దశలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు మొట్టమొదటి చీఫ్ ఇంజనీరుగా పనిచేసిన మీర్‌జాఫర్ అలి నిబద్ధత కొనియాడదగింది. ప్రపంచ రాతినిర్మాణాల ప్రాజెక్టుల్లోకెల్లా నాగార్జునసాగర్ డ్యాం పొడవు, ఎత్తుల్లో ప్రథమస్థానంలో ఉండడం విశేషం! నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ఇది 285 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి 408 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగివుంది. గత 44 ఏళ్లుగా వచ్చిన వరదలకు రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 312 టీంఎసీలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అంటే సుమారు 96 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని రిజర్వాయర్ కోల్పోయింది.

జవహర్ కెనాల్ కుడికాలువకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న శంకుస్థాపన చేశారు. అనంతరం ఈకాలువకు అ ప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నీటిని విడుదలచేసి జాతికి అంకితమిచ్చారు. దీనిని జవహర్ కెనాల్ అని పిలుస్తారు. ఈ కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లా లో సుమారు 203కి.మీ. ప్రవహిస్తూ రైతన్నల ఆశాజ్యోతిగా వెలుగొందుతోంది. ఈ కాలువ కింద 11.74 లక్షల ఎకరాలకు నీరందుతోంది. ఈ కాలువ కింద ఆయకట్టును 22 బ్లాకులుగా విభజించారు. వీటికి 9 బ్రాంచ్ కెనాల్స్ కలిగి 5342 కి.మీ. పంటలకు నీటిని అందిస్తోంది. దీనికితోడు ఫీల్డ్‌చానల్స్ ద్వారా




14,400 కి.మీ. పంటలకు నీరు అందుతోంది.

లాల్‌బహదూర్ కెనాల్ జై జవాన్.. జై కిసాన్ అని నినాదించిన మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జ్ఞాపకార్థం సాగర్ ఎడమ కాలువకు లాలా బహదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈ కాలువకు 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ శంకుస్థాపన జరుపగా కుడి కాలువతోపాటే ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తోంది. మొత్తం 297కి.మీ. పరిధిలోని పొలాలకు సాగునీరు అందుతోంది. దీనికున్న 7బ్రాంచ్ కాలువల ద్వారా 7722 కి.మీ., ఫీల్డ్ చానల్స్ ద్వారా 9654 కి.మీ. పంట పొలాలను సస్యశ్యామలం చేస్తుంది. వీటికితోడు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలయ్యే నీటితో కృష్ణాడెల్టా ప్రాంత రైతులకు పంట లు పండించేందుకు ఉపయోగకరంగా ఉంది.

జలవిద్యుత్కేంద్రాలు నాగార్జునసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సేద్యపు నీటినే కాకుండా జలవిద్యుదుత్పత్తి చేసే కేంద్రంగా కూడా ప్రాధాన్యం పొందింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై నిర్మించిన 410 మెగావాట్ల ప్రధాన జలవిద్యుత్కేంద్రం, కుడి కాలువపై 90 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం, ఎడమ కాలువపై 60మెగావాట్ల జలవిద్యుత్కేంద్రాలను నిర్మించారు. వీటికితోడు కుడికాలువపై హైడల్ పవర్ ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ రాష్ట్రంలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్ కొరతను కూడా తీరుస్తోంది. అందుకే దీనిని బహుళార్థ సాధక ప్రాజెక్టు అని కూడా అంటారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా... నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రంగా కూడా పేర్గాంచింది. కృష్ణానది లోయలో మహాయాన బౌద్ధమత విస్తరణకు ఆచార్య నాగార్జునుడు నెలకొల్పిన యూనివర్సిటీ ప్రపంచంలో బౌద్ధ మత వ్యాప్తికి ఎంతో దోహదం చేసింది. క్రీస్తు శకం రెండవ శతాబ్ధంలోని శాతవాహన కాలంనాటి జీవనశైలి, మూడవ శతాబ్ధం నాటి ఇక్ష్వాకుల రాజధానిగా విజయపురి ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలోని ఏకైక ఐలాండ్ మ్యూజియంగా ఉన్న నాగార్జునకొండ, అనుపు, ఎత్తిపోతల, ప్రధాన జలవిద్యుత్కేంద్రాలను, కుడి, ఎడమ కాలువలను, మోడల్ డ్యాంను చూసేందుకు ప్రతిరోజూ వందలాది మంది దేశవిదేశీ పర్యాటకులు నాగార్జునసాగర్ రావడంతో ఇది ప్రపంచ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది.

చనాగార్జున సాగర్ ప్రాజెక్టు .....
10 వేల మంది కూలీల ప్రాణ త్యాగం..
కొన్ని వేల మంది నిరంతర కృషి...
తెలుగుజాతి స్వప్నసాకారం..
నల్గొండ ల వరం...
ప్రపంచంలో నే మానవ నిర్మిత రాతి కట్టడం...
నాగార్జున సాగర్.

కృష్ణా నదిపై నిర్మించబడ్డ ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు (%చీఘస్త్రుఘతీయబఅఖ ాఘస్త్రుఘతీ% ) అతి పెద్దది. ఇది ఒక బహుళార్థసాధక ప్రాజెక్టు. తెలంగాణలో నల్గొండ జిల్లా నందికొండ వద్ద నిర్మించిన ఈ ఆనకట్టను మొదట్లో చనందికొండ ప్రాజెక్టు అని పిలిచేవారు. ఈ ప్రాంతానికున్న చారిత్రక ప్రాధాన్యం వలన ఈ ప్రాజెక్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని పేరుపెట్టారు.

నందికొండ గ్రామం నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో ఉంది. ప్రాజెక్టు నిర్మాణానంతరం నాగార్జునసాగర్‌గా ప్రసిద్ధి చెందింది. నాగార్జునసాగర్ పట్టణము మూడు భాగములుగా విభజించబడింది. ఆనకట్టకు దక్షిణాన విజయపురి సౌత్ (వీ.పీ.సౌత్) (గుంటూరు జిల్లా), ఆనకట్ట దాటిన వెంటనే ఉత్తరాన పైలాన్ (నల్గొండ జిల్లా), ఉత్తరాన కొండ మీద హిల్ కాలనీ (నల్గొండ జిల్లా) ఉన్నాయి...

సాగర్ డ్యామ్ విశేషాలు... :-
మొత్తం రాతి కట్టడం పొడవు – 4,756 అడుగులు
ఎడమ వ్కెపు మట్టికట్ట పొడవు – 8,400 అడుగులు
కుడి వ్కెపు మట్టి కట్ట పొడవు – 2,800 అడుగులు
మొత్తం ఆనకట్ట పొడవు – 15,956 అడుగులు
రేడియల్ క్రస్ట్ గేట్లు – 26
ఒక్కొక్క దాని ఎత్తు, పొడవు – 4,445 అడుగులు
గరిష్ఠ నీటి మట్టం – 590 అడుగులు

## అపోహలు, అసత్య ప్రచారాలు నమ్మవద్దు

### జిల్లా ఎస్పీ జానకి షర్మిల



**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**గత రెండు రోజుల నుంచి సామాజిక ఇతరత్రా మద్యమాలలో ప్రచారం అవుతున్నట్లు దిలావర్పూర్ మండలం గుండంపల్లి గ్రామ రైతులపై ఎలాంటి కేసులు పెట్టలేదని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. ఆందోళన నేపథ్యంలో అప్పుడు నమోదైన కేసులు మాత్రమే ఉన్నాయని వారికి నోటీసులు పంపారని మళ్ళీ ఏ రైతు పైన కేసులు పెట్టలేదని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు

# అదనపు కలెక్టర్ కు సమ్మె నోటీసు అందుచేత



**నిర్మల్ ప్రతినిధి ( మన వెలుగు ) డిసెంబర్ 10 :**సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నుండి సమ్మె చేస్తున్నట్లు తెలుపుతూ సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కలెక్టర్ కు సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు నోటీసు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులు ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొన్నారు

## మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

### ఎస్ఐ సతీష్



**గొల్లపెల్లి (మన వెలుగు)డిసెంబర్ 10 :**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రేపు అనగా 11న ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించబడును ఎస్సై సతీష్ తెలిపారు మంగళవారం బీబిరాజు పల్లి, చిల్వకోడూరు విసిట్ చేసి అక్కడ గ్రామ యువతీ యువకులతో మీటింగ్ ఏర్పాటు చేశారు. రేపటి మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు. జాబ్ మేళాలో దాదాపు వివిధ రకాలైన 50కి పైగా కంపెనీలు రేపు జాబ్ మేళలో పాల్గొంటారని 10వ తరగతి పాసైన యువతి యువకుల లతో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ,ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ చదువుకున్న యువతి యువకులకు కూడా రేపటి జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు వారి అర్హతలను బట్టి కల్పించబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణ, బొమ్మేన కుమార్, యూత్ లీడర్ వెంకటేష్ గౌడ్ యువతి ,యువకులు పాల్గొన్నారు.

## భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగాలా..

## వద్దా.. వైద్య నిపుణులు ఏమంటున్నారు..?

భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగవద్దని కొందరు చెబుతుంటారు. నీళ్లను తాగడం వల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావని, తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదని, దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయని అంటుంటారు. అయితే కొందరు మాత్రం భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగితేనే మంచిదని, ఇది ఆహారంతో సరిగ్గా కలుస్తుందని, ఆహారం సులభంగా జీర్ణం అయ్యేందుకు నీళ్లు ఎంతగానో దోహదపడతాయని అంటుంటారు. అయితే వీటిలో ఏది నిజం, ఎవరు చెబుతున్నది అర్థం చేసుకోవాలి, దేన్ని పాటించాలి.. అని చాలా మంది కన్ఫ్యూజ్ అవుతుంటారు. భోజనం చేసేటప్పుడు నీళ్లను తాగితేనే మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. దీంతో మనం తిన్న ఆహారం సులభంగా పేగుల్లో కదులుతుంది. దీని వల్ల ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. అలాగే మలబద్ధకం అన్నది ఉండదు. అయితే భోజనం చేసేటప్పుడు మరీ ఎక్కువ నీటిని తాగకూడదు. అర గ్లాసు నీళ్లను మాత్రమే తాగాలని అంటున్నారు. దీని వల్ల మనం తినే ఆహారం పేగుల్లో సులభంగా కదులుతుంది. అలాగే గొంతు పట్టేయకుండా ఉంటుంది. కాస్త నీటిని తాగితే ఫర్వాలేదు. జీర్ణాశయం అందుకు అనుగుణంగా ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఎక్కువ నీటిని మాత్రం తాగకూడదు. అలా చేస్తే కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు వస్తాయి.ఇక భోజనం చేయడానికి 30 నిమిషాల ముందు నీళ్లను తాగితే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా గ్రహిస్తుంది. అలాగే మలబద్ధకం సమస్య ఉండదు. ఈ విధంగా నీళ్లను తాగడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఫలితంగా ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో సహాయ పడుతుంది. అలాగే భోజనం చేసిన అనంతరం నీళ్లను 30 నిమిషాలు ఆగాక తాగాలి. దీంతో

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY
బుధవారం11 డిసెంబర్ 2024

## ఎడిటోరియల్

# వేటాడే ధర్మం

తమ విద్వేష ఎజెండా అమలుకు, ఉన్మాద చర్యలకు అడ్డొచ్చిన వారిని బిజెపి, ఆర్ఎస్ఎస్ పరివారం ఏ విధంగా కక్షకట్టి వేటాడి వెంబడించి చిత్రవధలకు గురి చేస్తాయో గుజరాత్ మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ ఉదంతం తిరుగులేని ఉదాహరణ. ఆలిండియా సర్వీస్ పోలీస్ అధికారికే ఇంతటి ఘోర అనుభవం ఎదురైందంటే, ఇక సాధారణ వ్యక్తుల పరిస్థితేంటో తలచుకుంటే భయం కలుగుతుంది. దాదాపు 27 సంవత్సరాల నాడు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిని నేరం ఒప్పుకోవాలని ప్రమాదకర ఆయుధాలతో, కరెంట్ షాక్‌లతో టార్చర్ పెట్టారన్న కేసులో సంజీవ్ భట్‌ను నిర్దోషిగా గుజరాత్‌లోని పోర్‌బందర్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం నిర్దోషిగా ప్రకటించింది. ప్రాసిక్యూషన్ సందేహింపజాలని సాక్ష్యాధారాలు చూపలేకపోయిందని, ఒక ప్రభుత్వ అధికారి ప్రాసిక్యూషన్‌కు సరైన అనుమతి తీసుకోలేదని కోర్టు తప్పుబట్టింది. కాగా రెండున్నర దశాబ్దాలకుపైన తనపై నమోదైన అభియోగాలు తప్పుడువని నిరూపించుకోడానికి పోలీస్ అధికారి భట్ పడ్డ వ్యయప్రయాసలు, ఎదుర్కొన్న మానసిక వ్యధ మాటల్లో చెప్పలేం. ఇక్కడితోనే న్యాయ పోరాటం ఆగిపోయిందని కాదు. భట్ పూర్తిగా బయట పడ్డారనుకోడానికి వీల్లేదు.ఎంతటి వారినైనా బిజెపి ఏ రకంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తుందో భట్ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే అర్థమవుతుంది. 1994లో ఆర్‌డిఎక్స్, ఇతర భయంకర అక్రమ ఆయుధాల ల్యాండింగ్‌పై పోలీసులు 22 మందిపై టాడా కేసు పెట్టి అరెస్ట్ చేశారు. అహ్మదాబాద్ సబర్మతి జైలులో ఉన్న నరన్ జాదవ్, ఇతర నిందితులను 1997లో పి.టి. వారెంట్‌పై పోర్‌బందర్‌కు విచారణకై తరలించారు. అక్కడ పోలీస్ కస్టడీలో నేరం ఒప్పుకోవాలంటూ ఎస్‌పిగా ఉన్న భట్, కానిస్టేబుల్ వాజుభాయి చౌ తమను టార్చర్ చేశారని నిందితుడు నరన్ జాదవ్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశాడు. కొన్నేళ్ల విచారణ అనంతరం 2013లో భట్, చౌలపై ఎఫ్ఐఆర్ నమోదుకు మేజిస్ట్రేట్ ఆదేశించారు. తీర్పు వచ్చే లోపు కానిస్టేబుల్ చౌ చనిపోయాడు. ఉగ్రవాద నిరోధక చట్టం టాడా కేసులోని నిందితుడి ఫిర్యాదుపై ఇన్నేళ్లు ఒక ఐపిఎస్ అధికారిపై కేసు నడవడం స్థానిక బిజెపి ప్రభుత్వ ప్రోద్బలం లేకుండా అసంభవం. 61 సంవత్సరాల మాజీ ఐపిఎస్ మరో రెండు కేసుల్లో శిక్ష పడి రాజ్‌కోట్ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. ఇవి కూడా బిజెపి వెనుకుండి బనాయించిన కేసులే కావడం గమనార్హం.సంజీవ్ భట్‌పై బిజెపికి ఎందుకంత కక్షనో అర్థం కావాలంటే కాస్త వెనక్కి వెళ్లాలి. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం 1990లో ఎల్‌కె అద్వానీ చేపట్టిన దేశ వ్యాప్త రథయాత్రను నిలిపేశాక గుజరాత్‌లో పెద్ద ఎత్తున మత అల్లర్లు రేగాయి. జామ్‌జోథ్‌పూర్ పట్టణంలో బంద్‌లో ఘర్షణలు సృష్టిస్తున్న 150 మందిని పోలీస్ అధికారిగా ఉన్న భట్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విడిచిపెట్టాక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయారు. దాన్ని లాకప్ మరణంగా చిత్రీకరించడంతో ఆ కేసులో భట్ జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఒక లాయర్‌ను డ్రగ్స్ కేసులో 1996లో ఇరికించిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2002లో గుజరాత్ మత అల్లర్ల విషయంలో అబద్ధపు సాక్ష్యాలు సృష్టించారన్న కేసులో సామాజిక ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్, నాటి డిజిపి శ్రీకుమార్‌తో పాటు భట్ కూడా నిందితుడు. అన్నింటికీ మించి 2002లో గోద్రా అనంతర మారణకాండకు అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ ప్రమేయం ఉందని భట్ అఫిడవిట్ ఇవ్వగా సిట్ తోసిపుచ్చింది. ఈ కార్పణ్యంతోనే భట్‌ను ఏవో సాకులు చెప్పి సర్వీస్ నుంచి 2015లో గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేయగా, కేంద్ర హెూం మంత్రిత్వశాఖ ఏకంగా సర్వీస్ నుంచి తొలగించింది. న్యాయం కోసం భట్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. బిజెపి, మోడీ కక్ష కడితే ఇలా ఉంటుందని భట్ జీవితం ద్వారా తెలుస్తుంది. పైశాచికంగా సామూహిక అత్యాచారానికి గురై, కుటుంబాన్ని కోల్పోయిన బిల్కిస్‌బానో కేసులో శిక్ష అనుభవిస్తున్న ముద్దాయిలకు చట్టం, రాజ్యాంగం, కోర్టులను కాలరాసి క్షమాభిక్ష పెట్టగలరు. భీమాకోరేగావ్ వంటి కేసుల్లో అక్రమంగా ఇరికించి ఏళ్లకు ఏళ్లు బెయిల్ రాకుండా అడ్డుకోనూగలరు. తమ దారికి రాని భట్ వంటి సిన్సియర్ అధికారులను వెంటాడి వేధిస్తారు. ఇదీ బిజెపి, మోడీ, సంఘ్ పరివారం ధర్మం, నీతి!

# నయా ఉదారవాదం, అంతకు మునుపు కాలం




అన్ని విమర్శలూ మత విమర్శతో ప్రారంభం కావాలని మార్క్స్ ఒక సందర్భంలో అన్నాడు. అదే మాదిరిగా ఆర్థిక అంశాలకు సంబంధించి ప్రస్తుత కాలంలో విమర్శ జిడిపితో మొదలు కావాలి. జిడిపి అనే భావనతో సహా, దానికి సంబంధించిన గణాంకాలు మొత్తం బూటకమే. ఆ ప్రాతిపదిక దోపిడీ అనే ఒక లక్షణాన్ని గుర్తించదు. ఉదాహరణకు: మొఘల్ చక్రవర్తి, అతడి అధికార గణం పొందే ఆదాయాన్ని దేశానికి వాళ్ళు అందించిన సేవలకు ప్రతిఫలం అని జిడిపి అంటుంది. వాళ్ళు పొందే మొత్తాన్ని దేశపు మొత్తం చేసిన ఉత్పత్తికి అదనంగా కలిపి జిడిపిని లెక్కిస్తుంది. నిజానికి అది దేశ ఉత్పత్తి నుండి ఆ మొఘల్ చక్రవర్తి, తదితరులు చేజిక్కించుకున్న భాగమే. కాని దానిని కూడా ఉత్పత్తిలో భాగం అని లెక్కించడం ద్వారా రెండింతలుగా చూపిస్తుంది. ఇది తప్పు. కాని నయా ఉదారవాద సమర్థకులు ఆ విధంగానే లెక్కించి ఆ కాలం చాలా గొప్పగా అభివృద్ధి చెందినట్టు చిత్రిస్తారు.అదే విధంగా నయా ఉదారవాద విధానాలకు పూర్వం ఉనికిలో ఉండిన (ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచిన) కాలంలో కన్నా నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి రేటు చాలా ఎక్కువగా ఉందని, అంతకు పూర్వపు కాలంలోని 40 ఏళ్ళలో భారతదేశ ఆర్థిక పురోగమనం చాలా మందకొడిగా సాగిందని చెప్తూ నయా ఉదారవాద విధానాల కాలంలోనే దేశాబివృద్ధి వేగం పుంజుకున్నట్టు చెప్పుకుంటారు.ఒకానొక కాన్ఫరెన్సులో నేను, నా సహచరుడు సంయుక్తంగా సమర్పించిన పత్రాన్ని విమర్శిస్తూ ఐఎంఎఫ్ డైరక్టర్ ఇదే విధంగా నయా ఉదారవాద కాలంలోనే మన దేశ ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందంటూ వ్యాఖ్యానించాడు. అయితే ఆ సందర్భంలో ఆయన జిడిపి గురించి ప్రస్తావించలేదు. 1960, 70 దశకాల్లో మన దేశంలో ఎక్కడ చూసినా ఎంతసేపూ అంబాసిడర్ కార్లు లేదా ఫియట్ కార్లు మాత్రమే కనిపించేవని, అదే నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చాక చాలా స్టైలిష్‌గా ఉంటూ వేగంగా దూసుకుపోయే కార్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఒక పేరున్న ఆర్థికవేత్త అయినప్పటికీ, ఆ ఐఎంఎఫ్ డైరక్టర్ సాంఘిక సంక్షేమం అంటే ఏమిటో అర్థం చేసుకోలేకపోయాడని నాకర్థమైంది.

అయితే జిడిపి ప్రమాణాన్ని సమర్థించే వాదనలను అంత తేలికగా తీసిపారేయకూడదు. ఉత్పత్తి అయిన సంపద ఏ విధంగా పంపిణీ ఔతోందన్న అంశాన్ని కాని, సాంఘిక సంక్షేమం ఎలా అమలౌతోందన్న అంశాన్ని కాని జిడిపి సూచించదు. అందుచేత కేవలం జిడిపి నే కొలబద్దగా తీసుకుని నయా ఉదారవాద విధానాలు మెరుగైనవా లేక వాటికన్నా అంతకు మునుపు అమలు జరిగిన విధానాలే కాస్త నయమా అన్నది నిర్ధారించకూడదని నా అభిప్రాయం. నయా ఉదారవాద కాలంలో ఆదాయాల్లో అసమానతలు తగ్గకపోగా మరింత పెరిగాయని, దిగువ స్థాయి ప్రజల పరిస్థితులు మరింత దిగజారాయని మనకి ఇప్పటికే స్పష్టంగా తెలుసు. అందుచేత ఇక్కడ ప్రశ్న ఏమంటే నయా ఉదారవాద కాలంలో అత్యధిక ప్రజానీకం జీవన స్థితిగతులు అంతకు మునుపటి కాలంలో కన్నా మెరుగు పడ్డాయా లేక దిగజారాయా అన్నదే. నా అభిప్రాయం దిగజారాయనే. అంతేకాక, నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధిరేటు నమోదైనదానిని కూడా అతిగా చేసి చూపించారు. చాలా మంది పరిశోధకులు సైతం ఈ కాలంలో జిడిపి వృద్ధిరేటును అతిగా అంచనాలు వేశారని, అందుచేత ఆర్థిక వృద్ధి రేటును కూడా అతిగా అంచనా వేశారని వాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుడిగా పని చేసిన అరవింద్ సుబ్రమణియన్ వారిలో ఒకరు. 2011-12 నుంచి 2016-17 మధ్య కాలంలో భారతదేశపు వృద్ధి రేటు ప్రతీ ఏటా కనీసం 2.5 శాతం అదనంగా లెక్కించారని ఆయన అన్నారు. 2011-12లోనే జిడిపి అంచనాలకు కొత్త ప్రాతిపదికను ఉపయోగించడం మొదలుబెట్టారు. ఇప్పటిదాకా అదే ప్రాతిపదికను కొనసాగిస్తున్నారు. అందుచేత అంతకు ముందు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధి రేటు వాస్తవానికి 1 శాతం లేదా 1.5 శాతానికి మించదు. మరోపక్క ఆదాయాలలో అసమానతలు నిస్సందేహంగా పెరిగిపోయాయి. అంటే సామాన్య ప్రజల ఆదాయాలలో పెరుగుదల ఏమీ లేదన్నట్టే. అందుచేత ఆ సామాన్య ప్రజల కోణం నుంచి చూసినప్పుడు నయా ఉదారవాద కాలం సాధించిన విజయం ఏమీ లేదు. పైగా పెరిగిన అసమానతలు దేశంలోని ప్రజాతంత్ర వ్యవస్థల్ని, సమానత్వ విలువల్ని దెబ్బ తీశాయి.అంతేకాదు. ప్రజల జీవన పరిస్థితులు దిగజారిపోయాయన్న విషయాన్ని ధృవపరిచే ప్రత్యక్ష ఆధారాలు మన దగ్గర ఉన్నాయి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో (1900 తర్వాత) బ్రిటిష్ వారి పెత్తనంలో భారతదేశం ఉన్నప్పుడు తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. మనకు స్వతంత్రం వచ్చేనాటికి అది కాస్తా 137 కిలోలకు పడిపోయింది. వలస పాలన కొనసాగిన ఆ 50 సంవత్సరాల కాలంలో ఏకంగా 31 శాతం పడిపోయింది! నయా ఉదారవాద పండితులు ప్రస్తుతం తూర్పారబడుతున్న కాలంలో (అంటే ప్రభుత్వ నియంత్రణతో ఆర్థిక వ్యవస్థ 1960-1980 కాలం) ఇది 186.2 కిలోలకు పెరిగింది. ఇది తప్పకుండా గణనీయమైన పెరుగుదల. కాని 20వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాల నాటి స్థాయికి చేరలేదు. నయా ఉదారవాద విధానాలు అమలవడం తర్వాత 2008 వరకూ దీర్ఘకాలం పాటు తలసరి ఆహారధాన్యాల లభ్యత పడిపోతూ వచ్చింది. ఆ తర్వాత కొంత పెరిగి, 2019-20లో 183.14 కిలోలకు చేరింది. 1991 నాటి స్థాయిని 2020-21లో మాత్రమే దాటి 186.77 కిలోలకు చేరింది. 2021-22లో కాస్త పెరిగి 187.13 కిలోలకు చేరింది. ఆహారధాన్యాల లభ్యత అనేది అభివృద్ధిని మదింపు చేసే ఒక ముఖ్యమైన ప్రమాణం. ఆ ప్రమాణం రీత్యా చూస్తే ఎదుగూ బొదుగూ లేకుండా నయా ఉదారవాద కాలంలో స్తంభించిపోయింది. 2022-23లో కోవిడ్ సహాయం కింద తలా 5 కిలోలు అందించిన కారణంగా తలసరి ఆహారధాన్యాల లభ్యత మరికాస్త పెరిగింది. అయితే దీనిని వృద్ధికి సంకేతంగా పరిగణించలేం. ఎందుకంటే ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను కరగబెట్టి ప్రజలకు పంచారే తప్ప అదనపు ఉత్పత్తి ఏమీ సాధించలేదు.ఇప్పటివరకూ మనం ఆహారధాన్యాల సగటు లభ్యత ఆధారంగానే చర్చించాం. అందులో ఏ యే తరగతులకు ఎంతెంత అందుతోంది అన్నది చూడాలి. ఒకపక్క ఆదాయాల్లో అసమానతలు పెరుగుతున్నప్పుడు అధికాదాయ వర్గాల్లో ఆహారధాన్యాల లభ్యత, వినియోగం పెరుగుతుంది. అదే విధంగా అల్పాదాయ వర్గాల్లో ఆ లభ్యత, వినియోగం తగ్గుతాయి. ఫలితంగా అల్పాదాయ వర్గాల ప్రజలకు పౌష్టికాహారం అందకుండా పోతుంది.ఈ విషయాన్ని ధృవీకరించే ఆధారాలు ఉన్నాయి. 1970 దశకంలో అప్పటి ప్లానింగ్ కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో 2200 క్యాలరీలు, పట్టణ ప్రాంతాలలో 2100 క్యాలరీలు శక్తిని ఇచ్చే ఆహారాన్ని ప్రతీ ఒక్క వయోజనులూ పొందగలిగి వుండాలని కనీస ప్రమాణాన్ని నిర్ణయించారు. అంతకు తక్కువ మోతాదులో పొందుతున్న వారంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టే పరిగణించారు. 1973-74 లో గ్రామీణ ప్రాంతాలలో ఆ కనీస ప్రమాణం ప్రకారం ఆహారం పొందలేక పోతున్నవారు 56.4 శాతం ఉండేవారు. 1993-94 నాటికి వారు 58 శాతం అయ్యారు. అంటే నయా ఉదారవాద విధానాలు అమలు అవడానికి మునుపు గ్రామీణ పేదరికం స్థాయిలో పెద్దగా మార్పు లేదు. పేదరికం పెరగనూ లేదు, తగ్గనూ లేదు అని చెప్పవచ్చు.దాని పూర్తి భిన్నంగా 1993-94 నుండి 2017-18 మధ్య కాలంలో కనీస స్థాయిలో పౌష్టికాహారాన్ని పొందలేకపోయినవారు గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం నుండి 80 శాతానికి పెరిగారు (2017-18 నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాలను మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. అందుచేత ఉజ్జాయింపుగానే లెక్కించాల్సి వచ్చింది)! పేదరికం పరిస్థితి ఎంత దిగజారిందంటే ఆ గణాంకాల్ని ప్రభుత్వం తొక్కిపట్టడమే కాకుండా, పేదరికపు కొలమానాలనే మార్చివేసి కొత్త పద్ధతిలో శాంపిల్ సర్వే మొదలుపెట్టింది. దీనిని బట్టి నయా ఉదారవాద కాలంలో జిడిపి ప్రమాణ సమర్థకులు చెప్తున్న దానికి న్నంగా గ్రామీణ పేదరికం పెరిగిపోయిందని స్పష్టమౌతోంది.యితే నయా ఉదారవాద సమర్థకులు దీనికి జవాబుగా ఒక వాదనను ముందుకు తెస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది తమ బిడ్డల్ని స్కూళ్ళకి పంపుతున్నారని, ఆధునిక వైద్య సౌకర్యాలు పొందగలుగుతన్నారని, సెల్ ఫోన్లను అందరూ వాడగలుగుతున్నారని, గ్రామీణుల జీవనశైలి మారిపోయిందని, ఆహారధాన్యాల కన్నా తక్కిన విషయాల మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారని, వారి అభిరుచులు మారిపోయాయని అంటూ, ఈ కారణాల వలన వారు తీసుకునే పౌష్టికాహారపు క్యాలరీల విలువ తగ్గిపోయిందని అంటున్నారు. దానిని బట్టి వారి పేదరికం పెరిగిపోయిందని నిర్ధారించకూడదంటున్నారు.

వాళ్ళు ఇక్కడ విస్మరిస్తున్న అంశం ఒకటుంది. ప్రజలు వినియోగించే పలు రకాల సరుకుల్లో కొన్ని రకాల సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం సాధ్యపడదు. మరికొన్ని సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం వలన వారికి వెనువెంటనే ఇబ్బందులు రానప్పుడు అటువంటి సరుకుల వినియోగాన్ని వారు తగ్గించుకుంటారు. ఆహారధాన్యాలు ఈ రెండో కోవకు చెందుతాయి. వాటి వినియోగాన్ని తగ్గించుకుంటే వెనువెంటనే ఇబ్బందులు తలెత్తకపోవచ్చు కాని దీర్ఘకాలంలో నష్టం కలుగుతుంది. ఒక ఆపరేషన్ అవసరమైనప్పుడో లేదా క్యాన్సర్ లాంటి రోగం సోకినప్పుడో చేయవలసిన ఖర్చు తగ్గించనూ లేరు, వాయిదా వేయనూలేరు. ఇటువంటి అనుకోని ఖర్చులు వస్తూనే వుంటాయి. అదే విధంగా సాంకేతిక పురోగతి కారణంగా కొన్ని కొత్త రకాల సరుకుల వినియోగం మొదలౌతుంది. కొన్ని పాత రకపు సరుకుల వినియోగం నిలిచిపోతుంది.

ప్రమాదకరమైన రోగం సోకినప్పుడు ఒక వ్యక్తి తన గ్రామంలో ఉండే భూతవైద్యుడి మీద ఆధారపడలేడు. ఆధునిక వైద్యాన్ని ఆశ్రయించక తప్పదు. ఆ సందర్భంలో రోజువారీ ఆహారం మీద పెట్టే ఖర్చు తగ్గించుకోవడం అనివార్యం. అతడు ఆధునిక వైద్యం మీద ఖర్చు చేయగలుగుతున్నాడు గనుక అతని ఆర్థిక స్థితి మెరుగుపడిందని నిర్ధారించలేం కదా. పైగా ఆధునిక వైద్యపు ఖర్చులు విచ్చలవిడిగా పెరిగిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇంగ్లండ్ చక్రవర్తి 7వ హెన్రీ ఒక గాయం అల్సర్‌గా మారి సెప్టిక్ అయినందువలన మరణించాడు. అప్పటికి యాంటీ బయాటిక్స్ ఇంకా కనుగొనలేదు. ఇప్పుడు ఒక సామాన్యుడు ఆ యాంటీ బయాటిక్స్‌ను వాడగలుగుతున్నాడు. కాబట్టి ఈ సామాన్యుడు ఆనాటి 7వ హెన్రీ చక్రవర్తి కన్నా మెరుగ్గా జీవిస్తున్నాడని ఎవరైనా అనగలరా? తన జీవితంలో ఎప్పటికప్పుడు మారుతూ వుంటే పరిస్థితులను బట్టి తన వినిమయాన్ని మార్చుకోవడం అనివార్యం. అయితే, ఆ క్రమంలో ఆహారధాన్యాల వంటి కనీస అవసరాల వినిమయాన్ని సైతం తగ్గించుకోవలసిన పరిస్థితి ఉందా? లేదా? అన్నదానిని బట్టి అతడి జీవన స్థాయి మెరుగు పడిందో లేదో నిర్ధారించగలం.

ఇలా నిర్ధారించే క్రమానికి ఆహారధాన్యాల లభ్యత అన్నది ఒక స్పష్టమైన ప్రమాణం. ఆ లభ్యత తగ్గుతోందీ అంటే సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడడం లేదనే లెక్క.

నయా ఉదారవాద విధానాలకు పూర్వపు కాలంలో సామాన్యుల జీవన స్థితిగతులు ఎంతో కొంత మెరుగుపడ్డాయి. ఒకవైపు వారికి ఆహారధాన్యాల లభ్యతా పెరిగింది. మరోవైపు ఆధునిక సరుకులను వారు పొందగలగడం కూడా పెరిగింది. అయితే ఇదేమీ చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పలేం. కాని, నయా ఉదారవాద కాలంలో మాత్రం పౌష్టికాహార లేమీ పెరిగిపోతోంది. జీవన పరిస్థితులూ దిగజారిపోతున్నాయి. జిడిపి గణాంకాలను చూపిస్తూ ఈ మౌలిక సత్యాన్ని మరుగుపరచలేరు.

# కేరళ ప్రజలకు అండగా నిలుద్దాం

%నూరు శాతం అక్షరాస్యత, 77 ఏళ్ళ ఆయు: ప్రమాణం సాధించిన, మహిళా సాధికారత, విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన, స్థానిక సంస్థలకు విధులు, నిధులు వికేంద్రీకరించి సుపరిపాలన అందించడంలో దేశంలో అగ్ర స్థానంలో పయనిస్తున్న రాష్ట్రం కేరళ. సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం ప్రజానుకూల విధానాలను అమలు చేస్తున్నది. ఆర్ఎస్ఎస్ అండదండలతో వివిధ రాష్ట్రాలపై మతోన్మాదాన్ని రుద్ది రాజకీయ పబ్బం గడపుకొనేందుకు పూనుకుంటున్న మనువాదులకు కేరళ వామపక్ష ప్రభుత్వం కొరకరాని కొయ్యగా ఉంది. అందుకే ఆ రాష్ట్రంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షగట్టి లక్ష కోట్లకు పైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా ఆ రాష్ట్ర అభివృద్ధిని అస్థిర పరిచేందుకు కుయుక్తులు పన్నుతున్నది. దేశాన్నే కలిచివేసిన వయనాడ్ వరదల్లో మరణించిన వారికి కేంద్రం పైసా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈ 11వ తేదీన దేశ వ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదుల నాయకత్వంలో జరుగుతున్న కేరళ సంఘీభావ కార్యక్రమానికి అన్ని తరగతుల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

1957లో భారతదేశంలోనే మొట్టమొదట కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన రాష్ట్రం కేరళ. ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో భూసంస్కరణలు అమలు చేసి 36 లక్షల మంది పేదలకు, కౌలురైతులకు భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టు ప్రభుత్వానిది. కమ్యూనిస్టు పాలనను ఓర్వలేని, భూస్వాముల తొత్తుగా ఉన్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ళు తిరగక ముందే వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేసింది. అయినా ప్రజలు తిప్పికొట్టి వామపక్ష ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకున్నారు. అందుకే నాటి నుండి నేటి వరకు కేరళలో కమ్యూనిస్టులు ఓడినా, గెలిచినా ప్రజల కోసం పనిచేస్తున్నారు. కేరళ గత 7 సంవత్సరాలుగా అన్ని రంగాల్లో పురోగమిస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తోంది.

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రణాళిక బడ్జెట్‌లో 28 శాతం స్థానిక సంస్థల నిధులు కేటాయిస్తుంది. ఇవిగాక సాధారణ పరిపాలన కోసం రెవెన్యూ ఆదాయంలో 6.5 శాతం వాటా పంచాయతీలకు ఇస్తుంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా స్థానిక సంస్థలకు విధులు, నిధులు కేటాయించి గ్రామ పంచాయతీలను స్థానిక ప్రభుత్వ సచివాలయాలుగా మార్చివేసింది. అన్ని రాష్ట్రాలలో కనీసం తాగునీటికి, విద్యుత్ బల్బులకు నిధులు లేక కునారిల్లుతుంటే కేరళలో ప్రతి పంచాయతీకి కోట్లలో రాష్ట్ర బడ్జెట్ నుండి నిధులు సమకూరుతున్నాయి. ప్రతి పంచాయతీ ఆఫీస్‌లో 18 నుండి 20 మంది వరకు ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. మన రాష్ట్రంలోని ఆర్డీవో ఆఫీస్ స్థాయిలో అక్కడి పంచాయతీ కార్యాలయం ఉంటుంది. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు కేటాయించి సర్వ అధికారాలు ఇస్తున్నారు. అందుకే ఎక్కడా లేనంతగా మహిళా సాధికారత కేరళలో కన్పిస్తుంది.

ఒకనాడు ఆహార ధాన్యాల కొరత ఎదుర్కొన్న రాష్ట్రం కేరళ. పరిమితమైన భూమి, కొండకోనల్లో సుగంధ ద్రవ్యాలు, వాణిజ్య పంటలకే పరిమితమైన రాష్ట్రం నేడు ఆ రాష్ట్ర ప్రజలకు ఆహార ధాన్యాలు, కూరగాయలు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నది. 2019లో ఎకరాకు 2,547 కేజీల వరి పండిస్తే నేడు 3,073కు పెరిగింది. కూరగాయలు 7.25 మెట్రిక్ టన్నుల నుండి 14.9 మెట్రిక్ టన్నులకు పెరిగింది. రైతాంగానికి ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీ సహాయం వల్లనే ఇది సాధ్యమైంది. నేడు వరికి రూ.2800 మద్దతు ధర ఇస్తుందంటే రైతుల పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల వామపక్ష ప్రభత్వానికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. 2020-21లో ప్రపంచాన్నే వణికించిన కరోనా సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 2013లో ఆహార భద్రతా చట్టం అమలు చేసిన రాష్ట్రం కేరళ. 'అతిజీవనం కేరళీయం' పథకాన్ని ప్రవేశ పెట్టి 80 లక్షల కుటుంబాలకు 17 రకాల నిత్యావసర సరుకులు అందించి ప్రజల ప్రాణాలను కాపాడింది. ఆ రాష్ట్ర ప్రజలనే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వెళ్ళిన వారిని వలస కార్మికులు అనకుండా గెస్ట్ వర్కర్లుగా నామకరణం చేసి అందరికీ తమ ప్రజల మాదిరిగానే నిత్యావసర సరుకులు అందించి ఆదర్శంగా నిలిచింది.వ్యవసాయ కార్మికులకు, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తున్నది. గుజరాత్ మోడల్ అని చెప్తున్న బిజెపి పాలిత రాష్ట్రంలో సగటు వేతనం రూ.300 ఉంటే కేరళలో రూ.720 ఉంది. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా రైతు, కూలీల మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పరించింది. కూలీలు పని చేసిన రోజే రైతు దగ్గర డబ్బులు లేకపోతే పంచాయతీలే కూలీలకు వేతనాలు చెల్లిస్తాయి.

రైతు తమ దగ్గర ఉన్నప్పుడు పంచాయతీకి చెల్లిస్తాడు. ప్రతి రైతు సంక్షేమ బోర్డుకి 10 నుంచి 15 రూపాయలు నిధి చెల్లించాలి. కూలీ రూ.2 చెల్లించాలి. ప్రభుత్వం తమ వాటా చెల్లిస్తుంది. ఈ డబ్బుతో వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం, 60 ఏళ్ళు దాటిన వారికి పెన్షన్ సంక్షేమ బోర్డు ద్వారా అందిస్తారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమ పాళ్లలో అమలు జరపడానికి 83 వేల కోట్లతో నవ కేరళ నిర్మాణాన్ని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టింది. సహకార రంగానికి పెట్టింది పేరైన కేరళలో స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించే ఉద్దేశంతో సహకార రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. లక్ష కోట్లతో కేరళ కోఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభించింది. గ్రామీణ పేదలకు వేల కోట్లు అప్పులు ఇస్తున్నారు. కాని ఈ వ్యవస్థను దెబ్బ తీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దేశంలో గుజరాత్ మోడల్ అని చెప్తున్న మోడీ ఆ రాష్ట్రంలో 10 వేల లోపు ఉద్యోగాలు ఇస్తే కేరళలో విజయన్ ప్రభుత్వం 3 లక్షల ఉద్యోగాలు కల్పించింది. మన దేశానికి కావాల్సింది కేరళ మోడల్.

లౌకికతత్వానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కేరళ మార్గదర్శకంగా నిలుస్తున్నది. కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే కేరళ ప్రజల మధ్య కలహాలు సృష్టించడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి ఎన్ని కుట్రలు పన్నినా వారి ఆటలు సాగడం లేదు. గ్రామీణ భారతంలో అంటరానితనం విలయ తాండవం చేస్తుంటే కేరళ అందుకు భిన్నంగా దళితులను దేవాలయ పూజారులుగా నియమించి చరిత్ర సృష్టించింది. దళిత వ్యక్తిని దేవాదాయ శాఖ మంత్రిగా నియమించింది. ఇటువంటి రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుచుకునే కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.ప్రజలకు అంకితమై పని చేస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉంది. ఆ రాష్ట్రానికి సంఘీభావం తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రతిఘటనకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.